చిరుద్యోగులపై 'పచ్చ పతాస్త్రం'

- ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు
- వీఓఏలు, డీలర్లను తప్పుకోవాలని హుకుం
- వైన్‌షాప్ ఉద్యోగులకూ తప్పని వేధింపులు



పొదలకూరు : కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత పట్టణ, గ్రామాల్లో చిరుద్యోగులకు భద్రత లేకుండాపోయింది. వీరిలో చాలా మందికి రాజకీయ రంగు పులిమి ఉద్యోగాల నుంచి ఊడగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. చిరుద్యోగులకు మొత్తంగా చూసుకుంటే నెలకు రూ.10 వేలు కంటే అదనంగా జీతం వచ్చే పరిస్థితి ఉండదు. అయితే వారిపై పచ్చ పతాస్త్రం ప్రయోగిస్తుండడంతో వారు విలవిల్లాడిపోతున్నారు. బతుకుదెరువు కోసం ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకుని జీవిస్తున్న వేతన జీవుల జీవితాలతో అధికార పార్టీ నాయకులు ఆడుకుంటున్నారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. మహిళామణులైతే తాము చేస్తున్న ఉద్యోగాన్ని నిలుపుకుని కుటుంబాన్ని పోషించుకునేందుకు నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా వారు కనికరించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా సర్వేపల్లి నియోజకవర్గంలో ఉపాధిహామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, పొదుపు సంఘాల లెక్కలు చూసే వీఓఏలు, వైన్‌షాపుల్లో ఉద్యోగులు, రేషన్ షాపు డీలర్లు అధికార పార్టీ వేధింపులు తాళలేక పోతున్నట్లు వాపోతున్నారు. బాధితులు బహిరంగంగా చెప్పుకోలేకున్నా సన్నిహితుల వద్ద కన్నీటి పర్యంతం అవుతున్నట్లు తెలుస్తోంది.

అయితే ఇప్పటి వరకు సర్వేపల్లి నియోజకవర్గంలో చిరుద్యోగుల జోలికి వెళ్లకుండా స్వచ్ఛందంగా మానేసి వెళ్లాలని హుకూం జారీ అయినట్లు తెలుస్తోంది. ఉపాధి పనులను కొంతకాలం నిలిపివేసి మేట్ల ద్వారా ఇప్పుడు పనులు చేపడుతున్నారు. వీఓఏలను తమకు తామే ఉద్యోగం మానేసుకోవాల్సిందిగా అధికారుల వద్దనే చెప్పిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు ఇబ్బందులు పడలేక స్వచ్ఛందంగా మానేసి గ్రామాల్లో తమకు చేతనైన పనికి వెళ్లి జీవిస్తున్నారు. డీలర్లపైనా వేధింపులు ఆగడం లేదని, స్వచ్ఛందంగా మానేయకుంటే విజిలెన్స్‌ను పురమాయించి షాపులను రద్దు చేయిస్తామని బెదిరిస్తున్నట్లు బాధితులు అంటున్నారు. అయితే డీలర్లలో అధికార పార్టీ సానుభూతిపరులకు వచ్చిన ఇబ్బందుల్లేకున్నా తటస్థంగా, వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులుగా ఉన్నవారు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. వైన్‌షాపుల ఉద్యోగులు మాత్రం లిక్కర్ పాలసీ మారితే తమకు ఎలాగు ఉద్యోగం ఉండదని, ఉన్నన్ని రోజులు ఉంటామనే భావనలో పనిచేస్తుండగా వారిలో కొందరిని ఇదివరకే తొలగించారు.

సర్వేపల్లి నియోజకవర్గంలో చిరుద్యోగులు	
ఫీల్డ్ అసిస్టెంట్లు 98 మంది	వీఏఓలు 138 మంది
వైన్‌షాపుల ఉద్యోగులు 89 మంది	రేషన్‌షాపు డీలర్లు 184 మంది

సానుభూతి చూపాలి



చిరుద్యోగులుగా ఉన్న వారు, మహిళలపై ఏ పార్టీ అధికారంలో ఉన్నా సానుభూతి చూపాలి. వేధింపులకు గురిచేసి వారిని ఉద్యోగాల నుంచి తొలగించడం మంచి పరిణామం కాదు. వారికి రాజకీయ పార్టీలను ఆపాదించడం తప్పు. ఎవరు అధికారంలో ఉన్నా చిన్నపాటి ఉద్యోగుల జోలికి వెళ్లకూడదు.

– కె.ప్రసాద్‌రెడ్డి, మొగళ్లూరు, పొదలకూరు మండలం

జీవనోపాధిపై కొట్టారు



ప్రభుత్వ మద్యం షాపులో సేల్స్‌మెన్‌గా నెలకు రూ.16 వేలు వేతనం వస్తోంది. దీంతోనే జీవనం గడిచేది. టీడీపీ అధికారంలోకి వచ్చాక స్థానిక నేతల అనుచరులకు సేల్స్‌మెన్ ఉద్యోగం ఇప్పించుకునేందుకు మాకు రాజకీయ రంగు పులిమి తొలగించారు. ఒక్కసారిగా ఉద్యోగం కోల్పోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. ఇలా అన్యాయం చేయడం సమజసం కాదు.

– ఇ.కమలాకర్, తొలగించిన సేల్స్‌మెన్, నార్తురాజుపాళెం

ఇలా చేస్తారని ఊహించలేదు



ప్రభుత్వ మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా నెలకు వచ్చే రూ.19 వేలతోనే జీవనం గడిచేది. స్థానిక టీడీపీ నేతలు నన్ను తొలగించారు. జీవనోపాధి కోల్పోయి మా కుటుంబ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మా కడుపు కొట్టి మరొకరికి ఉద్యోగం ఇప్పించడం టీడీపీ నేతలకే చెల్లుతుంది.

– డి.ఉదయ్‌కిరణ్, తొలగించిన సూపర్‌వైజర్, నార్తురాజుపాళెం

ఇది సరికాదు



టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చిరుద్యోగులను తొలగించి, వారి స్థానాల్లో కొత్తవారిని నియమించే ఆలోచన చేయడం సరికాదు. ఈ పరిస్థితి గతంలో ఎప్పుడూ లేదు. ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు, ఐకేపీ వీఓఏలను తొలగించాలని ప్రతిచోట అధికారులపై ఒత్తిడి తీసుకురావడం మంచి పద్ధతి కాదు.

– వెంకటరమణయ్య, కురిచెర్లపాడు, వెంకటాచలం మండలం

చిరుద్యోగులపై ప్రతాపం సరికాదు



కూటమి ప్రభుత్వంపై చిరుద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే వారిపైనే ప్రతాపం చూపడం సరికాదు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇలాంటి పనులు చేస్తే ప్రజలు హర్షించరు. తక్కువ జీతాలతో పని చేసే చిన్నపాటి ఉద్యోగులపై ఇలాంటి చర్యలు సమంజసం కాదు. వారికి న్యాయం చేసేలా పాలన చేయాలి. – కె.మల్లికార్జున, కోవూరు

ఉసురు తగులుతుంది



చిన్న ఉద్యోగాలు చేసుకుంటున్న వారిపై టీడీపీ ప్రభుత్వం పగబట్టడం సమంజసం కాదు. రాజకీయాలతో సంబంధం లేనివారికి పార్టీల పేరు చెప్పి విధుల నుంచి తొలగించడం అన్యాయం. ఎలాంటి ఆరోపణలు లేకపోయినా అకారణంగా తొలగిస్తున్న కూటమి ప్రభుత్వానికి చిరుద్యోగుల ఉసురు తప్పక తగులుతుంది. – మన్నెం చిరంజీవులగౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, తోటపల్లిగూడూరు

రాజకీయ కక్షలు మానుకోవాలి



ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల పట్ల రాజకీయ కక్షలకు పాల్పడడం సమంజసం కాదు. ప్రభుత్వం మారిన వెంటనే ముత్తుకూరు మండలంలో ఆరుగురు ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారు. ఇంకా ఎంతమందిని తొలగిస్తారో తెలియదు. పేదవాళ్లపై రాజకీయ ప్రతాపం చూపడం మానుకోవాలి.

– గడ్డం అంకయ్య, సీపీఎం కార్యదర్శి, ముత్తుకూరు మండలం

వారి కడుపు కొట్టడం అన్యాయం



చిరుద్యోగులైన ఉపాధిహామీ పథకం క్షేత్ర సహాయకులు, వీఓఏలను టీడీపీ ప్రభుత్వం తొలగించి వారి కడుపు కొట్టడం అన్యాయం. ఏళ్ల తరబడి నిజాయతీగా విధులు నిర్వహించే వారిని తొలగించి, కొత్తవారిని నియమించాలనే ఆలోచన విరమించుకోవాలి. అధికారులు జోక్యం చేసుకుని ప్రస్తుతం కొనసాగే వాళ్లే విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలి.

– అడపాల ఏడుకొండలు, ఇస్కపాళెం, వెంకటాచలం మండలం

కోవూరు నియోజకవర్గంలో..	
ఫీల్డ్ అసిస్టెంట్లు 69 మంది	వీఏఓలు 180 మంది
వైన్‌షాపుల ఉద్యోగులు 87 మంది	రేషన్‌షాపు డీలర్లు 192 మంది

ఇది అన్యాయం



చిన్న ఉద్యోగాలు చేసుకుని బతికే వారంతా పేదవాళ్లు. రాజకీయ కారణాలతో చిరుద్యోగులను విధుల నుంచి తొలగించడం అన్యాయం. పేదవాళ్లను ఇబ్బంది పెట్టడం మంచిది కాదు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించడం వల్ల ఒరిగేదీమీ ఉండదు.

– దువ్వూరు కోదండరామిరెడ్డి, పోలంరాజుగుంట, ముత్తుకూరు మండలం

బలవంతంగా రాజీనామా చేయించారు



మా గ్రామంలో చిరంజీవి అనే యువకుడు ఎన్నో ఏళ్లుగా ఉపాధి హామీ పథకంలో క్షేత్ర సహాయకునిగా పనిచేస్తున్నాడు. బాగా పనిచేస్తాడనే పేరు ఉంది. అయితే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అనుకూలంగా ఉండే వారిని నియమించుకునేందుకు అతని చేత బలవంతంగా రాజీనామా చేయించారు. రాజకీయ కారణాలతోనే ఇలాంటి పనులు చేశారు.

– మన్నెమాల సుధీర్‌రెడ్డి, గురివిందపూడి, మనుబోలు

చిరుద్యోగుల కడుపు కొడుతారా?



మా గ్రామంలో చాలా కాలంగా పనిచేస్తున్న ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడిని తొలగించారు. అతనికి రాజకీయ పార్టీలతో ఎటువంటి సంబంధం లేదు. అయినా రాజకీయ కారణలతో తొలగించడం అన్యాయం. వారికి అనుకూలంగా లేరన్న సాకుతో చిరుద్యోగుల కడుపు కొడుతారా. వీఓఏల విషయంలో కూడా ఇలాగే చేస్తున్నారు.

– గుండాల ఆదినారాయణ, కట్టువపల్లి, మనుబోలు

నిరంకుశ పాలనకు నిదర్శనం



అధికారంలోకి రావడమే చిరుద్యోగులపై టీడీపీ ప్రభుత్వం తన ప్రతాపాన్ని చూపుతోంది. కూటమి ప్రభుత్వం అందరినీ బయటకు పంపుతోంది. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఓఏలు, పారిశుద్ధ్య కార్మికులు ఇలా ఎవరిని వదలిపెట్టడం లేదు. ఇది నిరంకుశ పాలనకు నిదర్శనం.

– కోటా శేఖర్‌రెడ్డి, వరిగొండ, తోటపల్లిగూడూరు మండలం

క్లుప్తంగా

కామాక్షితాయికి విశేషాలంకరణ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో ఆషాడ మాస సారె సమర్పణ కార్యక్రమంలో భాగంగా చివరిరోజు శనివారం కామాక్షితాయి అమ్మవారు విశేషాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి పలురకాల పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, గాజులు తదితర వస్తువలతో సారె సమర్పించారు. కార్యక్రమాలను ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక


జగన్

పొదలకూరు : మండలంలోని వరదాపురంలో ఉన్న శ్రీసాయినాథ్ స్కూల్ టెన్త్ విద్యార్థి జగన్(586 మార్కులు) ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ డి.శ్రీనివాసులురెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

కృష్ణపట్నంలో క్లీన్ అండ్ గ్రీన్



ముత్తుకూరు : మండలంలోని కృష్ణపట్నం గ్రామంలో అదానీ ఫౌండేషన్–పంచాయతీ ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ పనులను శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ హెడ్ రాజేష్ రంజన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా చేపట్టిన పనులు వారం రోజుల పాటు జరుగుతాయని తెలిపారు. స్థానిక నాయకులు ఏకొల్లు కోదండరామయ్య, బొనిగి ఆనందయ్య, రాగాల శివకృష్ణ, పంచాయతీ కార్యదర్శి మస్తానయ్య, కరణం నాగరాజు, గోవిందయ్య పాల్గొన్నారు.

విధి నిర్వహణలో బాధ్యతగా ఉండాలి


జొన్నవాడలో మహిళతో మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : విధి నిర్వహణలో వైద్య సిబ్బంది బాధ్యతగా ఉండాలని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలి అన్నారు. మండలంలోని జొన్నవాడ పీహెచ్‌సీని ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా టీబీ బాధితులకు అందుతున్న సేవలు, కుష్ఠువ్యాధి నివారణ కార్యక్రమాలు, బీసీజీ వ్యాక్సినేషన్ తదితర విషయాలపై ఆరాతీశారు. గ్రామంలో అందుతున్న వైద్యసేవల గురించి ప్రజలతో మాట్లాడారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ దయాకర్, పీహెచ్‌సీ డాక్టర్ అహ్మద్‌బాబు, డాక్టర్ వినయ్, సూపర్‌వైజర్ వీర శివకుమార్, ల్యాబ్ టెక్నీషియన్ యాసిన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

తోటపల్లిగూడూరు : ప్రస్తుత వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఉప్పల స్వర్ణలత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ క్రమంలో తాగునీరు, పారిశుద్ధ్యంతో పాటు ఇతర అభివృద్ధి పనులపై అధికారులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో మొదలైన అభివృద్ధి పనులను పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ బాలాజీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, మండల ఉపాధ్యక్షులు చెరుకూరు శ్రీనివాసులునాయుడు, కంజి నీలమ్మ, డీటీ శివయ్య, స్థానిక ఎంపీటీసీ రాయపు శీనయ్య పాల్గొన్నారు.

దుకాణంలో చోరీ

కోవూరు : స్థానిక కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న ఓ దుస్తుల దుకాణంలో కొందరు మహిళలు చోరీ చేశారు. దాదాపు ఎనిమిది మంది మహిళలు శనివారం ఒక్కసారిగా షాప్‌లోకి వచ్చి చీరలు కొనుగోలు చేస్తున్నట్లు నటించి ఏమీ కొనకుండా వెళ్లిపోయారు. తరువాత యజమాని పరిశీలించుకోగా రూ.8 వేలు విలువైన దుస్తులను చోరీ చేసినట్లు గుర్తించారు. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు లేదు.

తల్లిపాలు అమృతంతో సమానం

విడవలూరు : తల్లిపాలు అమృతంతో సమానమని, ముర్రుపాల ఆవశ్యకత గురించి తెలుసుకోవాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ బి.రమణి అన్నారు. మండలంలోని వావిళ్ల సెక్టార్ దండిగుంట అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని ఆమె శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ అప్పుడే జన్మించిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు తాగించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు జయంతి, సావిత్రి, అంగన్‌వాడీ టీచర్లు శిరీష, వాణి, భారతి, శైలజ, జయశ్రీ, ప్రసన్న, లక్ష్మి పాల్గొన్నారు.

కోనేటిమిట్ట అంగన్‌వాడీ కేంద్రంలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని 18వ వార్డు కోనేటిమిట్ట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న సూపర్‌వైజర్ శకుంతల మాట్లాడుతూ తల్లిపాలు పురిటిబిడ్డల ఆరోగ్యానికి సంజీవని అన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సుప్రజ, సింధూర, వాసవి తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలే దివ్య ఔషధం

మనుబోలు : ముర్రుపాలు బిడ్డకు దివ్య ఔషధం లాంటిదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ రమణమ్మ అన్నారు. మనుబోలు మండల కేంద్రం సీఎంనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కనీసం సంవత్సరం పాటైనా బిడ్డకు తల్లిపాలు పట్టించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు సుభాషిణి, రాజేశ్వరి, అంగన్‌వాడీ సంపూర్ణమ్మ, హెచ్‌ఎం అనంతయ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో..

పొదలకూరు : మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. మహ్మదాపురం సెక్టార్ విరువూరు ఇసుకపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ ఆదినారాయణమ్మ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏఎన్‌ఎం అరుణ, ఎంఎస్‌కే రూప, ఎంఎల్‌హెచ్‌పీ యమున, అంగన్‌వాడీ టీచర్లు శీనమ్మ, శ్రీలక్ష్మి, గాయత్రి, అమరావతి, మాధురి పాల్గొన్నారు.

- తోడేరు ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో సూపర్‌వైజర్ పద్మజా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సులోచన, రమాదేవి, జయలక్ష్మి, కల్యాణి, కవిత, కొండమ్మ, విమలావతి పాల్గొన్నారు.
- పొదలకూరు సెక్టార్ వెంకటేశ్వరనగర్‌లో సూపర్‌వైజర్ ఎం.జ్యోతిలక్ష్మి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాల్సిందిగా సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు సునీత, సుగుణమ్మ, ఏఎన్‌ఎం చిత్ర, ఆశావర్కర్ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు రక్ష

కొడవలూరు : వివిధ రకాల వ్యాధుల నుంచి తల్లిపాలు బిడ్డకు రక్షణ కల్పిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల తెలిపారు. మండలంలోని గుండాలమ్మపాళెం గిరిజన కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి అంకమరాణి, ఏఎన్‌ఎం విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు హైమావతి, సంపూర్ణ, మమత, శ్రీవల్లి, రేణుక పాల్గొన్నారు.

- మిక్కిలింపేట అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి ఆదేశాలతో తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సౌమ్య, మహిళా పోలీస్ బాదుల్లాబి, ఏఎన్‌ఎం అనిత, అంగన్‌వాడీ కార్యకర్తలు కామేశ్వరి, అరుణ పాల్గొన్నారు.
- **తోటపల్లిగూడూరు :** మండలంలోని తోటపల్లిగూడూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ రంగమ్మ పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రాజేశ్వరి, భాగ్యమ్మ పాల్గొన్నారు.
- **ఇందుకూరుపేట :** మండలంలోని సోమరాజుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు బి.విమలమ్మ, బి.విజయభారతి, టి.రమణమ్మ, సాబీరా, గౌరీ తదితరులు పాల్గొన్నారు. మైపాడు పంచాయతీలో సూపర్‌వైజర్ ముంజుల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

ఇందుకూరుపేట : రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలు మండలంలోని ఇందుకూరుపేట ఎంకేఆర్ ఉన్నత పాఠశాలలో హోరాహోరీగా సాగుతున్నాయి. రెండో రోజు శనివారం వివిధ జిల్లాలకు చెందిన పురుషులు, మహిళల జట్ల మధ్య పోటీలు జరిగాయి. మూడో రోజు ఆదివారంతో పోటీలు ముగుస్తాయన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం



కోవూరు : మండల పరిధిలోని మోడేగుంట పరిసరాల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. దీనిని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు ఎస్సై రంగనాథ్‌గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీహెచ్‌సీల్లో మెరుగైన వైద్యసేవలు

వెంకటాచలం : వెంకటాచలం, పొదలకూరు క్లస్టర్ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లలో వైద్యసేవలు మెరుగునకు ప్రత్యేక చర్యలు చేపడతామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. వెంకటాచలంలోని సీహెచ్‌సీని సోమిరెడ్డి శనివారం పరిశీలించారు. మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. సీహెచ్‌సీకి రెండు జనరేటర్లు, కంప్యూటర్లు మంజూరు చేయిస్తామని తెలియజేశారు. అలాగే సీహెచ్‌సీ వద్దనే పోస్టుమార్టం చేయించేలా చూస్తామన్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుక్స్ పంపిణీ చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, బీజేపీ మండలాధ్యక్షుడు కుంచి శ్రీనివాసులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి



మనుబోలు : ప్రభుత్వం కల్లుగీత కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని కల్లుగీత పారిశ్రామికుల సంఘం, గౌడ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు తోట ప్రభాకర్‌గౌడ్ కోరారు. ఇటీవల తాటిచెట్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడిన ఉప్పల వెంకటేశ్వర్లు గౌడ్‌ను మనుబోలులో శనివారం పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో 450కు పైగా మార్కులు సాధించిన గౌడ విద్యార్థులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.5 వేల నగదు ప్రోత్సాహం అందజేస్తామన్నారు. గౌడ సంఘం నాయకులు వెంపులూరు శ్రీనివాసులుగౌడ్, తాళ్ల రాజాగౌడ్, రావుల అంకయ్యగౌడ్, కాల్తిరెడ్డి శ్రీనివాసులుగౌడ్, దాసరి రాజేష్‌గౌడ్, పద్మనాభయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నికలను ప్రశాంతంగా జరపండి


ముత్తుకూరు : మాట్లాడుతున్న ఎంఈఓ మధుసూదన


బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈఓ దిలీప్‌కుమార్

ముత్తుకూరు : అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 8వ తేదీన జరిగే స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్‌ఎంసీ) ఎన్నికలను ప్రశాంతంగా జరపాలని ఎంఈఓ మధుసూదన విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎమ్మార్సీ భవన్‌లో శనివారం జరిగిన హెచ్‌ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాలకు నిమిత్తం లేకుండా ఎన్నికలు జరపాలని, వివాదాల జోలికి వెళ్లవద్దని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యవహరించాలన్నారు. నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనాల వద్దకు చిన్నపిల్లలు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల హాజరుపై శ్రద్ధ చూపాలన్నారు. ఎంఈఓ–2 హేమసుందరరావు తదితరులు పాల్గొన్నారు.

సజావుగా నిర్వహించండి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ఈనెల 8న పాఠశాలల్లో నిర్వహించే ఎస్‌ఎంసీ ఎన్నికలను సజావుగా నిర్వహించాలని మండల విద్యాశాఖాధికారులు దిలీప్‌కుమార్, పీవీ రత్నం అన్నారు. పట్టణంలోని డీఎల్‌ఎన్నార్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులకు ఎస్‌ఎంసీ ఎన్నికల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. అదేరోజు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక పూర్తి చేసి ప్రమాణ స్వీకారం చేయించాలని పేర్కొన్నారు. తరువాత ఎక్స్ అఫీషియో, కోఆప్టెడ్ సభ్యులను కూడా ఎన్నుకోవాలని తెలిపారు.

